



విద్యుత్ సేవలపై సమీక్ష

ప్రజాశక్తి నెల్లూరు :తన తొలి లక్ష్యం వినియోగదారులకు విద్యుత్ సేవలపై సంతప్తి స్థాయిని పెంపొందించడమే అని ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) కె. గుర వయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో నెల్లూరు రూరల్ విద్యుత్ డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కె. గురవయ్య మాటాడుతూ వినియోగదారులకు అందుబాటులో ఉండేలా విధులు నిర్వహిస్తున్నామ న్నారు. ఎస్ఇ వి. విజయన్, నెల్లూరు రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. సోమశేఖర్ రెడ్డి, సూర్య ఘర్ జిల్లా నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాల చంద్ర , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రాన్సర్మర్స్ లక్ష్మి నారాయణ ఉన్నారు.


మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

ప్రభుత్వ నిర్ణయాలతో కార్మికులకు నష్టం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు

ప్రజాశక్తి నెల్లూరు : కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంలో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు విమర్శించారు. శనివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఆశ బారెడు... ఆచరణ మూరెడు అన్న చందంగా ఉందన్నారు. కష్ణపట్నం, విశాఖ ఉక్కు కర్మాగారాల్లో కార్మికులను తొలగించడం తప్ప రాష్ట్రంలో భారీ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన దాఖలాలు ఇప్పటి వరకూ ఏమీ లేవన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల కిందట పని గంటలు సవరించడం.. మహిళలతో రాత్రి పని చేయించడం వంటి విధానాలపై సముఖత వ్యక్తం చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు భద్రత లేదన్నారు. రాష్ట్రంలో ఈఎస్ఐ, పిఎఫ్ చట్టాలు రాబోయే రోజుల్లో అమలు కావన్నారు. రాష్ట్రంలో కనీస వేతన సవరణకు నోచుకోక 12 ఏళ్లు అయిందన్నారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. పని గంటల పెంపు, రెస్ట్ కావాలంటే ఎక్కువ సమయం పని చేయాలి, మహిళలతో రాత్రి సమయాల్లో పనిచేయిం చుకోవచ్చు వంటి విధానాలకు సిఎం అంగీకారం తెలిపినట్లు తాము భావిస్తున్నామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరావు అన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్నాయి పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేదని ఎటువంటి రక్షణ లేకుండా మహిళలతో రాత్రి సమయాల్లో పనిచేయించరాదని, ప్రభుత్వ నిర్ణయా లను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. తొలుత జిల్లాలోని ముస్లిములకు సిఐటియు రాష్ట్ర కమిటీ తరపున బక్రీద్ భాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్య దర్శులు టి వి వి ప్రసాద్,కే అజయ్ కుమార్ , సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

నకిలీ 'ఐఆర్ఎస్' అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు : తాను ఐఆర్ఎస్ అధికారిని అని నమ్మబలికి మోసం చేసేందుకు ప్రయత్నించిన కర్నాటక రాష్ట్రం, దొంగరంపూరు గ్రామాని చెందిన రాంపూర్ రమేష్ అనే వ్యక్తి సంతపేట పోలీసులు అరెస్టు చేశారని నగర డిఎస్పి పి.సింధుప్రియ పేర్కొన్నారు. శనివారం సంతపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ నకిలీ ఐఆర్ఎస్ అధికారి అరెస్టుకు సంబంధించిన వివరాలు ఆమె వెల్లడించారు. సింధుప్రియ మాట్లాడుతూ కర్నాటకలోని దొంగరంపూరు గ్రామాని చెందిన రాంపూర్ రమేష్ అనే వ్యక్తి తాను ఐఆర్ఎస్ అధికారిని, రీజనల్ జాయింట్ కమిషనర్‌గా నగరానికి బదిలీపై వచ్చినాని, విధుల్లో చేరే ముందు స్వామి వారిని దర్శనం చేసుకొనేందుకు వచ్చినట్లు ఈ నెల 4న నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవాలయం ఈఒ ఆళ్ల శ్రీనివాసులరెడ్డితో పరిచయం చేసు కున్నాడన్నారు. అదే సమయంలో తాను ఆదాయపన్ను, భూ వివాదాలు పరిష్కారం చేస్తుంటానని నమ్మబలికారన్నారు. అదే రోజు సాయంత్రం ఈఒకు ఐఆర్ఎస్ అధికారిని అని చెప్పిన వ్యక్తి ఫోన్ చేసి తనను నేరుగా వచ్చి కలవాలని చెప్పగా ప్రస్తుతం వీలుకాదని చెప్పి, ఐఆర్ఎస్ అధికారి మాటలు, వ్యవహారంపై అనుమానం వచ్చిన ఈఒ విచారణ చేసి నకిలీ అధికారి అని తెలియడంతో సంతపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే పోలీసులు స్పందించి అధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆ నకిలీ అధికారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వాహనాన్ని, స్టాంప్‌ను సీజ్ చేసినట్లు నగర డిఎస్పి పి.సింధుప్రియ పేర్కొన్నారు. ఈ కేసును త్వరితగతిన విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో ప్రతిభను కనపరిచిన సంతపేట పోలీసు స్టేషన్ సిఐ జి.దశరధరా మరావు, ఎస్ఐ జి.బాలకృష్ణ, సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి పి. సింధుప్రియ

కాకాణి కేసులో ముగ్గురికి బెయిల్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేసులో ముగ్గురికి బెయిల్ మంజూరైంది. పొదలకూరు అక్రమ మైనింగ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు పలువురు నెల్లూరు జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. శనివారం రాష్ట్ర హైకోర్టు ముగ్గురికి బెయిల్ మంజూరు చేసింది. ఎ6గా ఉన్న అరవింద్‌రెడ్డి, ఎ7లో ఉన్న కరుణాకర్‌రెడ్డి, మస్తాన్‌లకు బెయిల్ మంజూరైంది. ఎ1నుంచి ఎ7వరకు బెయిల్ రాగా ఎ4గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ నిరాకరించారు.ఈనెల 9న కాకాణి బెయిల్ పిటిషన్ కోర్టు ముందుకు రానుంది.

ఫీజు బకాయిలు చెల్లించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -నెల్లూరు :కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఫీజు ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటివరకు చెల్లించకపోవడం దారుణమని తక్షణమే ఆ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని బాలాజీ నగర్ స్థానిక రామచంద్రారెడ్డి భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను.నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే సంవత్సరకాలం పూర్తవుస్తోంది అయినా విద్యార్థులకు ఎన్నికలకు ముందు ఇచ్చినటువంటి హామీలు ఏవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. జిఒ నెంబర్ 77ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం కనీసం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలు ఏవి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు రూ. 3,500 వేల కోట్లు విద్యా,వసతి దీవెన బకాయిలు పెండింగ్లో ఉన్నాయ న్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రి అయినటువంటి నారా లోకేష్ వీటిపై దృష్టిపెట్టి పరిష్కరించాలన్నారు. లేదంటే ఆంద ోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్,యశ్వంత్,బాబి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

షైనింగ్ అవార్డులకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - లింగసముద్రం

2024 25 సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖ పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అందించే షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసింది. అందులో భాగంగా మండల కేంద్రమైన లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు కంచరగుంట మహాలక్ష్మి,పతకమూరి సుష్మ వరుసగా 586,585 మార్కులు సాధించి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు తెలియజేశారు.వీరికి 9వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా గార్డెన్స్ నందు జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,జిల్లా మంత్రి చేతుల మీదుగా రూ. 20,000 రూపాయల నగదు బహుమతి, మెడల్, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు. విద్యార్థులను ప్రధానో పాధ్యాయులు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.


కె మహాలక్ష్మి


పి సుష్మ

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు మంత్రి 'ఆనం' అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు ఎంపికైన బిఆర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులను మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందిచారు. పదవతరగతి పరీక్ష ఫలితాలను ఆధారంగా చేసుకుని షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డ్స్ కి కందుకూరు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులైన డి రక్షణ, కె. వేదశ్రీ, కె భావన,డి నవదీప్ కుమార్, పి విష్ణు ప్రసాద్ లు ఎంపిక అయ్యారు. శనివారం కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు విద్యార్థులతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిశారు. మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విద్యార్థు లను, యాజమాన్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు,బి.నరేంద్రబాబు ఉన్నారు.


విద్యార్థులకు అభినందిస్తున్న మంత్రి ఆనం,ఎంఎల్ఎ ఇంటూరి


కౌలు రైతులకు గుర్తింపు కార్డులు వ్వాలి

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని. గుడ్లూరు మండల రైతు సంఘం నాయకులు దామ రామకష్ణయ్య, సిద్ధయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం వైపు నుంచి వచ్చే పథకాలు వర్తించడం లేదన్నారు. పంటల సాగుకు ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చుకుంటున్నారన్నారు. ఫలితంగా వారు నష్టపోతున్నారన్నారు. గుర్తింపు కార్డులు ఇస్తే పథకాలు, సబ్సిడీ వంటి సదుపాయాలు పొందుతారన్నారు. పంట నష్టపరి హారం అందుతుందన్నారు. ఈ నేపథ్యంలో భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని. వారు డిమాండ్ చేశారు.

'మెడికవర్'లో సురక్షిత కాన్పులు

ప్రజాశక్తి -నెల్లూరు :హై రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలకు నగరం లో ని మెడికవర్ హాస్పిటల్ లో సురక్షితంగా కాన్పులు జరిపే అత్యాధు నిక వ్యవస్థ అందుబాటులో ఉందని హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి. సీతాలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ పి. మంజూష తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలు మెడికవర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ అంటే ఏమిటి, దానికి గల కారణాలు, చికిత్సలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానా లను మెడికవర్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి. సీతాలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ పి. మంజూషలు ప్రజల అవగాహన కోసం వివరించారు.


త్రిషజ్ఞ (466/470)


సాయి గీతిక (466/470)


నేహా (466/470)


ఫాతిమా (435/440(బైపిసి)

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-కందుకూరు

ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాలలో కందుకూరు బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ఎప్పటిలాగే తిరుగులేని ప్రతిభ కనబరిచారు.జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో470/466 మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారు. సాయి గీతిక (466) త్రిష జ్ఞ(466) నేహా(466) జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో కనీజ్ ఫాతిమా 440/435 తో టాప్ మార్కులు సాధించింది.అలాగే జూనియర్ సిఇసి లో (టౌన్ ఫస్ట్) ఎం సాయి పూజ (467/500) సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.అంతే కాకుండా అత్యధిక ఉత్తీర్ణత శాతం తో విద్యార్థిని,విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అందుకు కషి చేస్తున్న ఉపాధ్యాయులను ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు,కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో రవీంద్ర

ప్రజాశక్తి - కందుకూరు : కందుకూరు పట్టణంలో చేపట్టిన పలు అభివద్ధి కార్యక్రమాలలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కందు కూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వర రావులు హాజరయ్యారు. మంత్రి, ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు సోమనేని రవీంద్ర శనివారం కందుకూరు నియోజకవర్గంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఈకార్యక్ర మంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మంత్రి, ఎంఎల్ఎతో సోమనేని రవీంద్ర


ఉలవపాడులో..

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి -ఉలవపాడు

బక్రీద్ పండగను పురస్కరించుకొని శనివారం ముస్లిములు పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఈద్గా వద్ద ముస్లిం సోదరు లందరూ పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మౌలానా బక్రీద్ పండుగ కుర్బానీ ప్రాధాన్యతను పేర్కొన్నారు. అనంతరం ముస్లిం సోదరు లందరూ ఆ లింగనం చేసుకొని ఒకరి నొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న మసీదులో బక్రీదు వేడుకలు జరిగాయి. ముస్లిములు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

అభివృద్ధి పనులు.. శంకుస్థాపనలు..

కందుకూరు నియోజకవర్గంలో మంత్రి 'ఆనం' విస్తృత పర్యటన - 'మాలకొండ'లో ప్రత్యేక పూజలు


వలేటివారిపాలెం మండలంలో..

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మండలంలోని చుండి మాలకొండలో పలు అభివద్ధి పనులకు శనివారం దేవాదాయ దర్మాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్థానిక ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి శనివారం ప్రారంబోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. తొలుత చుండి నుండి అమ్మపాలెం మీదుగా గాంధీనగర్ వరకూ నాబార్డు నిధులు రూ.220 కోట్లతో చేపట్టిన నూతన తారురోడ్డును మంత్రి ప్రాంభించారు. అనంతరం మాలకొండలో కొండ కింద రూ. 1.56 కోట్లతో చేపట్టనున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులకు, రూ 2.65 కోట్లతో చేపటనున్న డార్మిటరీ హలు నిర్మాణ పనులకు. రూ.46.50 లక్షలతో కోట్లతో చేపటనున్న ప్రహరీగోడ నిర్మాణ పనులకు మంత్రి రామనారాయణరెడ్డి ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం కొండపైన రూ.80 లక్షలతో నిర్మించిన 5 వసతి గదులకు రూ.2.40 కోట్లతో నిర్మిచిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు రూ.77 లక్షలతో నిర్మించిన ఎస్ఎస్ క్యూలైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

మంత్రికి ఘన స్వాగతం

నరసింహస్వామి దర్శనానికి వచ్చిన మంత్రి రామనారాయణరెడ్డికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ప్రత్యేకంగా పూజలు చేయించారు. అనంతరం శాలువా పూలమాలతో సత్కరించారు.

అన్నదానంపై అంతృప్తి

మాలకొండలో అన్నదానంలో నాణ్యత కొరవడటంతో మంత్రి రామ నారాయణరెడ్డి అసంతప్తి వ్యక్తం చేశారు అన్నదానంలో బజ్జీ, కూరలు లేకపోవడంతో ఆలయ అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. ఎండోమెంట్ కమిషనర్ ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగరా బాబు, డిఎస్పీ సుబ్రహ్మణ్యం,సిఐ మంగారావు ఎస్సై మరిది నాయుడు మడల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి కామినేని వీరయ్య, చెరువుపల్లి సాంబయ్య, కామినేని అశోక్, చొప్పర రాఘవులు, చొప్పర చినబ్రహ్మయ్య, మేకల అశోక్ ఉన్నారు.

హామీలను నెరవేర్చాం..

ప్రజాశక్తి-కందుకూరు

దేవాదాయ శాఖలో ఇచ్చిన ప్రతి హామీని గత సంవత్సర కాలంలో నెరవేర్చినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు.శనివారం కందుకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం పర్యటన జరిపారు. తొలుత కందుకూరు పట్టణ ప్రజల ఇలవేలుపు అంకమ్మతల్లి దేవాలయంలో మంత్రి ఆనం, ఎం ఎల్ ఎ ఇంటూరి నాగేశ్వరరావు తో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంకమ్మతల్లి దేవాలయ ఆవరణలో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ కు భూమిపూజ చేశారు. అనంతరం ఆర్ టి సి ఆవరణలో పిడికిటి వెంకటేశ్వర్లు నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుకూరులో మాట్లాడుతూ ఆలయాల అభివద్ధికి కూటమి ప్రభుత్వం కషి చేస్తున్నదన్నారు. అందువల్లే గతంలో కంటే 30 శాతం అధికంగా భక్తులు దేవాలయాలను దర్శించుకుంటున్నారని తెలిపారు..

ఆలయ పునః నిర్మాణ పనులు త్వరలో పూర్తి

ఆలయ నిర్వహణ కష్టమైన నేటి పరిస్థితుల్లో పట్టణ నడిబొడ్డున ఉన్న అంకమ్మ తల్లి దేవాలయ ఆవరణ స్థలాన్ని ఆదాయ మార్గంగా మార్చే క్రమంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని పట్టణ పెద్దలు, ఎం ఎల్ ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆలోచన చేశారని మంత్రి తెలిపారు. అమ్మవారికి నిత్య కైంకర్యాలతో పాటు ప్రతి సంవత్సరం జాతర నిర్వహించేందుకు అందరి అభిప్రాయాలు సేకరించి ఒక విధానం రూపొం దిస్తామన్నారు.. ఎండోమెంట్ కమీషనర్ రామచంద్ర మోహన్,తెలుగుదేశం పార్టీ నాయకులు దామా మలేశ్వరరావు,నార్నె రోశయ్య,పిడికిటి వెంకటేశ్వర్లు, జనిగర్ల నాగరాజు,గుండవరపు నరసింహారావు, తల్లపనేని రవీంద్రబాబు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, వి సురేష్,మహర్షి శ్రీను,కోడాలి కోటేశ్వరరావు ఉన్నారు.



రేషన్ షాపుల వద్ద ఇక్కట్లు..

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్

రేషన్ కోసం బియ్యం కార్డు లబ్ధిదారులకు తిరుగుడు కష్టాలు మళ్లీ మొదలయ్యాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం వాహనాల ద్వారా లొకేషన్‌కు సరుకులు తీసుకొచ్చి ఇచ్చేవారని ఇటీవల వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను రద్దుచేసి నేపథ్యంలో తాము రేషన్ షాపులకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితులను ప్రభుత్వం కల్పించిందని. మహిళలు వాపోతున్నారు సర్వర్లు ఉదయం 10 గంటలకే మొరాయించటంతో ఎండతాటికి తట్టుకోలేక లబ్ధిదారులు ఇళ్ళకు వెళ్లి పోవాల్సిన పరిస్థితులు వచ్చాయని వాపోతున్నారు.మండలంలోని 36 రేషన్ షాపుల వద్ద ప్రజలు సర్వర్లు పని చేయని కారణంగా రేషన్ లబ్ధిదారులు గంటల సమయాలను వెచ్చించిన కూడా రేషన్ ఇవ్వలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. రేషన్ షాపులో సరుకులు .బియ్యం. చక్కెర. జొన్నలు ఇస్తున్నారని . రేషన్ కార్డుకు మూడు కిలోల చొప్పున బియ్యం తగ్గించుకుంటే వాటి బదులు మూడు కిలోలు జొన్నలు ఇస్తున్నారని 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు రేషన్ బియ్యం సరుకులను ఇంటి వద్దకే చేరుస్తామని చెప్పిన విధానం సరిగా అమలు కాలేదని ఇంకా కూడా లబ్ధిదారులకు లబ్ధి ఇండ్ల వద్దకు రావడం లేదని ప్రజలు చెబుతున్నారు అధికారులను ప్రజాశక్తి అడగగా రేషన్ డీలర్లని ఇంటి వద్దకు వెళ్లి ఇవ్వమని చెప్పినట్టుగా అధికారులు చెబుతున్నారు

అదేవిధంగా రేషన్ డీలర్లు వృద్ధుల లిస్టులను ఇవ్వనందున జాప్యం జరుగుతుంది. వృద్ధుల విషయంలో సరైన వివరణ లేని కారణంగా రేషన్ లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు సరైన ప్రణాళికతో ఇండ్ల వద్దకు రేషన్ లబ్ధి వృద్ధులకు చేర్చాలని సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


పత్తి కొనుగోలు కేంద్రంలో లోడింగ్ చేస్తున్న దృశ్యం

పెరిగిన పత్తి ధరలు

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరులో ఉన్న పత్తి కొనుగోలు మార్కెట్లో చివరి దశలో కింటా 4,800 నుంచి 6,800 కి ధర పెరిగినట్లు రైతులు శనివారం తెలిపారు. మే నెల మూడో వారంలో వర్షాలు పడడంతో పత్తి ధర అమాంతంగా పడిపోయింది. రైతుల దగ్గర నుంచి 90 శాతం పత్తి వ్యాపారులు కొనుగోలు చేయగానే ధరలు పెరగడంతో ఎక్కువ మంది రైతులు నష్టపోయారు. గుడ్లూరు మండలంలో ఈ ఏడాది 8 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మే నెలలో పత్తి కొనుగోలు ప్రారంభమైంది. తొలి దశలో ప్రతి మార్కెట్లో క్వింటా రూ. 6,000 నుంచి 7,000 వరకు ధర పలకడంతో రైతులు సంతోషంగా పత్తి తీత పనులు ముమ్మరంగా ప్రారంభించారు. మే నెలలో అకాల వర్షం పడటంతో తడిసిన పత్తి పేరుతో వ్యాపారులు ధరలు అమాంతంగా తగ్గించారు. దీంతో చేసేదేమీ లేక అనేకమంది రైతులు తక్కువ దొరికే తన పత్తిని అమ్ముకున్నారు గత రెండు రోజులుగా ధరలు మళ్లీ పెరగడంతో మిగిలిన కొద్ది మంది రైతులు మార్కెట్లో పత్తిని విక్రయిస్తున్నారు.



మాట్లాడుతున్న అధికారులు

వికసిత్ భారత్ సంకల్ప అభియాన్..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని తోటపల్లిగూడూరు, కోడూరు గ్రామాల్లో శనివారం భార త్ సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగం గా మట్టి నమూనాల సేకరణ, పరీక్షల పై అవగాహన కల్పించారు. నాణ్య మైన విత్తనాల ఎంపిక, విత్తనం వా డకం, చల్లడంపై అవగాహన, ఆవ శ్యకత, జీవన ఎరువుల ఆవశ్య క త, వాడకం, వేసవి దుక్కులు వాటి ప్రాముఖ్యత తదితర అంశాలపై రై తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకె శాస్త్రవేత్త కిర ణ్ కుమార్ రెడ్డి, జిల్లా వనరుల కేం ద్ర సహాయ సంచాలకులు మారుతీ దేవి, మండల వ్యవసాయ అధికారి శిరీష రాణి, బ్యాంకింగ్ కోఆర్డినేటర్ రవిశంకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు సుమంత్, వినీల్, శివ కుమార్, విద్యాసాగర్, నిరీష, శశి, డయానా, అనూష, ఝాన్సీ, వైష్ణవి, ఏఈఓ ప్రసన్న ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.



'శ్రీ మేధా' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-కావలి

ఇంటర్ బెటర్మెంట్ ఫలితాల్లో కావలి శ్రీ మేధా జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఎంపిసి విభాగంలో డి.మాలతి 470 మార్కులకు గాను 465, సీఈసీ విభాగంలో యశశ్రీకి 500 గాను 484 మార్కులు, బైపీసీ విభాగంలో బి.తనుశ్రీకి 440కి 405 మార్కులతో అగ్రస్థానంలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కళాశాల యాజమాన్యం కరస్పాండెంట్ జానకిరామ్, డైరక్టర్లు హరినారపరెడ్డి, మాల్యాద్రి, ప్రిన్సిపాల్ లోకేష్, వైస్ ప్రిన్సిపాల్ సాయికుమార్, అలాగే అధ్యాపక బృందం, విద్యార్థులను అభినందించారు. ఈ ఫలితాలకు సహకరించిన అధ్యాపకులకు విద్యార్థులు తల్లిదండ్రులకు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

ఈకెవైసిపై అలసత్వం వద్దు..



ప్రజాశక్తి కోవూరు

కోవూరు మండలంలోని అన్ని చౌక డిపోల పరిధిలో ఇంకా ఈకెవైసి చేసుకోని కార్డుదారులు 30వ తేదీలోగా తప్పనిసరిగా సంబంధిత రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ-పాస్ మిషన్లో నమోదు చేసుకోవాలని తహశీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కోవూరు మండలానికి సంబంధించి మొత్తం 47 రేషన్ షాపులకు గాను 223845 కార్డులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 161315 రేషన్ కార్డులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఉన్న రేషన్ కార్డుల్లో 2440 కార్డులు వృద్ధులకు, దివ్యాంగులకు సంబంధించిన కార్డులు ఉండగా.. శనివారం నాటికి 1782 మందికి రేషన్ సరుకులు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన 868 మందికి యుద్ధప్రాతిపదికన అందజేయాలన్నారు. అదేవిధంగా ఈకెవైసికి సంబంధించి కోవూరు మండలంలో 61674 యూనిట్లు ఉండగా.. ఇప్పటివరకు 57494 యూనిట్లకు ఈకేవైసీ నమోదు చేయడం జరిగిందన్నారు. పెండింగ్ ఉన్న యూనిట్లలో ఐదు సంవత్సరాల లోపు 510 మంది 80 సంవత్సరాల పైబడిన వద్దులు 54 మంది ఉన్నారన్నారు. అదేవిధంగా ఈకెవైసి నేటికీ చేయించుకోని వారు 3616 మంది 30వ తేదీలోగా తప్పనిసరిగా ఈకెవైసి నమోదు చేసుకోవాలన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనంతసాగరం

సోమశిలలోని శ్రీ కామాక్షి సమేత సోమేశ్వరాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన ఆదివారం ఉదయం 11.30 గంటలకు చేయనున్నట్లు శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర ఆలయ వంశపార ధర్మకర్తలు ఉప్పల విజయ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్ రెడ్డి శనివారం తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గం శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్‌టిఇ ప్రవేశాల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-కోవూరు

ప్రయివేట్ పాఠశాలలో విద్యాహక్కు చట్టం కింద కేటాయించిన సీట్లలో విద్యార్థులు చేరేందుకు సంబంధించిన గడువును జూన్ 10వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించడం జరిగిందని ఎంఇఒ ఎస్‌కె రహీమ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో 7వ తేదీలోగా పాఠశాలలో చేరాలని సంబంధిత విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, 7వ తేదీ బక్రీద్, 8వ తేది ఆదివారం సెలవు కారణంగా కేటాయించిన సీట్లలో విద్యార్థులు చేరే గడువును 10వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా ధ్వజారోహణ

ప్రజాశక్తి-కోవూరు



కోవూరులోని గాంధీ పార్కు సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రాతక్కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కొడిముద్దల కోసం భక్తులు వేచి ఉన్నారు. అనంతరం వారికి కొడిముద్దలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా సూరిశెట్టి సుబ్రహ్మణ్యం - కాంతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరి కృష్ణప్రసాద్, రుత్వికులు కృష్ణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరులో ముస్లిం సోదరులు ఎంతో భక్తిపార్వశంగా బక్రీద్ పండుగ వేడుకలు జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన విధంగా ప్రతివ్యక్తి శాంతియుతంగా జీవితాన్ని కొనసాగించాలనే తెలిపిన బోధనలతో అల్లాని కీర్తిస్తూ ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మొదట పట్టణంలోని ముస్లిం సోదరులు సత్రం సెంటర్ నుండి బయలుదేరి అల్లాని కీర్తిస్తూ ఈద్గా ప్రాంతానికి చేరుకున్నారు.. ఈద్గా ప్రాంత మసీదు పేష్ఇమామ్ కమ్రుజమా ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. తమ ప్రాంతంలోని ప్రతిఒక్కరూ ఎంతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సంతోషకరంగా జీవించే విధంగా ఆ అల్లా ప్రతి ఒక్కరికీ దీవెనలు అందించాలని ప్రార్థించారు.. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ సోదర భావంతో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : బక్రీద్ పర్వదిన వేడుకలను శనివారం మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లాపై ఉన్న విశ్వాశాన్ని చాటుతూ త్యాగాలకు మారుపేరుగా తాము బక్రీద్ పర్వదినాన్ని జరుపుకున్నామని ముస్లిం సోదరులు తెలిపారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని సంగం చెక్‌పోస్ట్ సెంటర్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలో త్యాగాలకు ప్రతిక అయిన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి మసీదులకు చేరుకున్నారు. కాశి పాలెంలోని మస్జిద్ ఏ హబీబ్, ఖాజా నగర్‌లోని మజీద్ ఏ ఆమీన్ మసీదుల వద్ద ముస్లిం మత పెద్దలైన ఈమామ్ అహ్మద్ రజా, అష్రాన్ రజాక్ బక్రీద్ పండుగ పవిత్రత గురించి పలు సందేశాలను ముస్లిం సోదరులకు వివరించారు. అనంతరం నమాజ్ ఆచరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దాంతో మసీదుల వద్ద కోలాహలంగా మారింది.

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలంలోని ప్రధాన ఈద్గాలో శనివారం త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ముస్లిములు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని మసీదులను పూర్తిగా రంగులతో వెల్లవేయించి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు -సయ్యద్ రఫీ అసోసియేషన్ కార్యదర్శి షేక్ జుబేర్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక అయిన ఈ బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గౌస్ బాషా, కోవూరులోని ప్రధాన ఈద్గాలో ఇమామ్, ఎస్కే షమీమ్. పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో దోపిడీ పాలన



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గంలో కూటమి నాయకుల దోపిడీ దొరికితే దొంగలు దొరక్కపోతే దొరలు అన్న చందంగా మారిందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని పాత ఎంపిడిఒ కార్యాలయ భవనం కూల్చివేసి అందులో విలువైన కలపను చెర్లోయడవల్లి గ్రామానికి ఎందుకు తరలించారో, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ప్రజాప్రతినిధికి దోచి పెట్టేందుకు ఈ విధంగా సహకారం అందిస్తున్నారా.. లేదా.. ఆయనకు భయపడి ప్రభుత్వాదాయానికి గండికోడుతున్నారా.. లేదా.. ప్రజలకు వివరించాలన్నారు. గతంలోనూ ఇదే విధంగా నారంపేట వద్ద సుమారు రూ.రెండు కోట్ల విలువైన జామాయిల్‌ను నరికి సొమ్ము చేసుకున్న విషయం మరువక ముందే మళ్లీ లక్షల విలువ చేసే కలపను తన ఇంటికి చేర్చుకోవడం వారి దోపిడీకి మీ స్థాయిలో ఉందో తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డికి ఈ విషయం ఇప్పటికే తెలిసి ఉంటుందని, దానిపై పూర్తిగా విచారణ జరిపించాలని కోరుతున్నామన్నారు. మంత్రి పేరు చెప్పుకొని అధికారులను భయపెట్టి ఇలా గ్రామాలకు తరలించిన విలువైన కలపను సోషల్ మీడియాలో వార్తలు ప్రసారం కాగానే మళ్లీ ఎంపిడిఒ కార్యాలయానికి తీసుకొచ్చారని, తీసుకెళ్లిన దాంట్లో 30శాతం మాత్రమే వెనక్కి వచ్చినట్లుగా తెలుస్తోందని దానిపై కూడా సదరు అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ ఆదాయం గండి కొడుతున్న ఆ ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్న లక్ష్మి, వైసిపి నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, నోటి వినయ్ కుమార్ రెడ్డి, సర్పంచ్ బీ వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్ బాషా, కల్పనారెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బిఐ సిబ్బంది

ప్రజాశక్తి-కావలి

దివంగత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ వై. తారకా నాథ్ 21వ వర్ధంతిని పురస్కరించుకొని యస్.బి.ఐ మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్టాఫ్ యూనియన్ తిరుపతి రీజియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జియస్ యన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకానాథ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందించార న్నారు. వారి వర్ధంతి సందర్భంగా కావలి సిబ్బంది, వినియోగదారులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. పలు బ్రాంచులలో ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ రక్తదానం అపురూపమైన సేవా కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది రక్తదాతలను సమీకరించిన ముంగమూరు గ్రామ మాజీ సర్పంచ్ యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్‌లను సత్కరించారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో 66మంది రక్తం సేకరించారు. కార్యక్రమంలో యస్.బి.ఐ. స్టాఫ్ యూనియన్ తిరుపతి రీజియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిరిధర్, కావలి మెయిన్, టౌన్, ట్రంక్ రోడ్డు బ్రాంచ్ ల కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, జ్యోత్స్న, సుమన, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ప్రకాశరావు, టి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదన రావు, పాలకమండలి సభ్యులు ఎస్‌కె నయీమ్, యన్ ప్రణీత్, టీం సేవియర్స్ తరపున హరి చందన పాల్గొన్నారు.



కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాద మృతులకు దాతృత్వం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో బుధవారం ఉదయం ఎఎస్‌పేట క్రాస్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇరువురు కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత నిత్యాన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి నగదు దాతృత్వం చేశారు. వెంకటరావుపల్లిలోని వారి నివాసాలకు శనివారం వెళ్లినా ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుల్లారెడ్డి, అజీమా కుటుంబ సభ్యులకు ఒకొక్క కుటుంబానికి రూ.25వేల వంతున రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదంలో కుటుంబ సభ్యుల కోల్పోయిన వారిని పరామర్శించి ధైర్యం తెలిపారు. అండగా ఉంటుందని ట్రస్టు ఎప్పుడు అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఆయనవెంట రెండోవాడు కౌన్సిలర్ కోటారెడ్డి, ఉపాధ్యాయుడు రాఘవరెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, కట్ట మహేశ్వర్ రెడ్డి, తదితరులున్నారు.

ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ఖాజా నాయబ్ రసూల్, అమ్మాజాన్ (దొరసానమ్మ) వెలసి ఉన్న ప్రాంతమైన దర్గా ప్రాంగణంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం కోసం, నమాజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దర్గా ఇఒ షేక్ మహమ్మద్ హుస్సేన్ పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు, బక్రీద్ పండుగను పురస్కరించుకొని, ముస్లిం సోదరులు ఎక్కువమంది మసీదులో నమాజ్ కొరకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా షామియానాలు, సీలింగ్ ఫ్యాన్లు, చల్లటి తాగునీరు, అదేవిధంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ప్రత్యేక ఏర్పాట్లు చేయడం వల్ల ఎక్కువ మంది మైనారిటీ సోదరులు ఆ ప్రదేశంలో ప్రార్థనలు, నమాజ్ చేసుకుని ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని, బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

డ్రెయినేజీ కాలువకు శంకుస్థాపన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



కొబ్బరికాయ కొడుతున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

రూ.10 లక్షల వ్యయంతో డ్రెయినేజీ కాలువ శంకుస్థాపన చేశామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డి పాలెం పట్టణం 9వ వార్డు శాంతినగర్‌లో రూ.10లక్షల నుడా నిధులతో డ్రెయినేజీ కాలువకు శనివారం భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం పట్టణాన్ని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. పట్టణంలోని శాంతినగర్ 9వ వార్డుకు రూ.10 లక్షలు నుడా నిధులు మంజూరు కాగా డ్రెయినేజీ కాలువ పనులు ప్రారంభించామన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్, పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, 6వ వార్డ్ కౌన్సిలర్ షేక్.రహమత్ భాషా, టిడిపి నాయకులు పఠాన్, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

ప్రాథమిక పాఠశాలలకు అప్‌గ్రేడ్

ప్రజాశక్తి - ఉదయగిరి

మండలంలో మూడు ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూలుగా విద్యాశాఖ అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి -1 షేక్ మస్తాన్ వలీ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంకట్రావుపల్లి, దాసరపల్లి, ఉదయగిరి బీసీ ప్రాథమికోన్నత పాఠశాలలను 2025-26 సంవత్సరంకు గాను 9,10 తరగతుల్లో చేరే విధంగా విద్యాశాఖ నుండి అనుమతులు వచ్చాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా చూడాలన్నారు. ముఖ్యంగా స్కూల్ కమిటీ చైర్మన్ లు గ్రామ కమిటీ నేతలు ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులు శాతాన్ని పెంచే విధంగా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు.

ట్రాన్స్‌ఫారంకు కంచె ఏర్పాటు

- ప్రజాశక్తి కథనంకు స్పందన

ప్రజాశక్తి - ఉదయగిరి



ట్రాన్స్‌ఫారంకు కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజాశక్తి కథనంకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన ప్రమాదం పొంచి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ కంచ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం ప్రజాశక్తి దినపత్రికలో విద్యుత్ శాఖతో మహిళకు గాయాలు అనే శీర్షికతో వచ్చిన కథనానికి విద్యుత్ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి కంచిని ఏర్పాటు చేయడంపై ప్రజాశక్తి దినపత్రికకు ప్రజా సంఘం నేతలు పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు. ప్రమాదం జరిగితే తప్ప చర్యలు పట్టించుకోని విద్యుత్ అధికారులపై ప్రజా సంఘ నాయకులు స్థానిక పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు మండలంలో ప్రమాద భరితంగా మారి ఉన్న విద్యుత్ స్తంభాలు సర్వీస్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నచోట మరో ఒక ప్రమాదం జరగకుండా తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు. జరిగిన ఘటనను స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టి ఫెన్సింగ్ ఏర్పాటు పై విద్యుత్ శాఖ ఎడిఎకు ప్రజా సంఘ నేతలు పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు.

లీగల్‌సెల్ సేవలు సద్వినియోగం చేసుకోండి..

ప్రజాశక్తి కోవూరు



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కోవూరులోని పాటూరు రోడ్డులో ఉన్న వైసిపి మండల కార్యాలయంలో ప్రతి శనివారం లీగల్ సెల్‌కు సంబంధించిన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని, పార్టీకి సంబంధించిన కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సలహాలు సూచనలు కావాలంటే వారి దగ్గర పరిష్కరించుకోవచ్చని మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, లీగల్ సెల్ నాయకులు శ్యామాచార్యులు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో సాధించింది ఏమీ లేదన్నారు. కేవలం వైసిపి నాయకుల మీద కేసులు పెట్టడమే పరమావధిగానే పెట్టుకున్నారే తప్ప ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిన పాపాన పోలేదన్నారు. గత వైసిపి పాలనలో రైతుల దగ్గర నుంచి చిన్నారులకు, మహిళలకు ప్రభుత్వ పథకాలు నేరుగా వారివారి ఖాతాల్లో జమచేసేవారన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా తల్లికి వందనం లేదు.. రైతు భరోసా లేదు.. మహిళలకు ఫ్రీ బస్సు లేదు.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదు. ఆడబిడ్డలకు రూ.18వేలు ఎటు పోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ 11 నెలల్లోనే ప్రజలకు ఈ ప్రభుత్వంపై ఉన్న ఆశలు ఆడియాశలు అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ వైసిపి ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలోనే ప్రజలకు ఈ ప్రభుత్వం మీద ఉన్న ఆశలు ఆడియా షశలు ఆయ్యాయన్నారు. లీగల్ సెల్ నేతలు మాట్లాడుతూ కేవలం కళ్లబొల్లి మాటలు చెప్పి అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందే తప్ప ఈ కూటమి ప్రభుత్వం సాధించింది ఏమీ లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచము అని చెప్పిన ఈ కూటమి ప్రభుత్వం యడాపెడా విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల పేద మధ్య తరగతుల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఈ ప్రభుత్వంలో జరుగుతున్న మోసాలను ఒక కంట గమనిస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్పే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, పట్టణ కన్వీనర్ నరసింహులురెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదులు, బాలకృష్ణ, మల్లికార్జున తదితరులున్నారు.

జిల్లాలో కరోనా కలవరం

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ఆరు కోవిడ్-19 కేసులు నమోదైనట్లు ప్రభుత్వ వైద్యులు ధృవీకరిస్తూ వార్తా కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా వాసులు ఒక్కసారిగా కలవరపాటుకు గురి చేసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నపిల్లలకు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్త వహించాలని, జనసమూహంలో తిరగకుండా, మాస్కులు, శానిటైజర్ వంటివి వాడాలని సూచనలు చేస్తున్నారు. కోవిడ్ కేసులైన ఆరు మంది కుటుంబ సభ్యులను, వారి ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి పరీక్షలు నిర్వహించామని ఎటువంటి ప్రమాదం లేదని వైద్యాధికారులు ప్రకటించారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీసు అధికారులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలోని ఇళ్లను తనిఖీ చేయడం, ఆ సమయంలో సరైన కాగితాలు లేని వాహనాలను సీజ్ చేయడం, బహిరంగ ప్రదేశాలల్లో మద్యపాన సేవనం చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం వంటి చర్యల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికి వాహనం ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేయడాన్ని నిలిపివేసి లబ్ధిదారులు రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొచ్చుకోవాలని ప్రభుత్వం సూచించడాన్ని కొంత మంది ప్రజలు స్వాగతిస్తుండగా మరి కొంత మంది అభ్యంతరం తెలియజేస్తున్నారు. వృద్ధుల ఇళ్ల వద్దకు రేషన్ డీలర్ నేరుగా వెళ్లి సరుకులు అందజేయాలన్న ప్రభుత్వ ఆలోచన పట్ల వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని 18 గ్రామాలల్లో రూ.11కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఇటీవల కాలంలో రూరల్ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం, పనులు పూర్తి చేసి ప్రారంభించడంతో ప్రజల నుంచి కోటంరెడ్డి సోదరులకు మంచి ఆదరణ లభిస్తుంది. వి.ఆర్. పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేసి ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముమ్మరంగా నగర శాసనసభ్యులు పొంగూరు నారాయణ గట్టి ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా వి.ఆర్. పాఠశాల నూతన హంగులతో కళకళలాడుతుంది. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి, వారి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడమే కాకుండా జిల్లా పేరు ప్రతిష్టను చాటుతున్న ఎంతో మంది మేధావులను తయారు చేసిన వి.ఆర్ పాఠశాల మూతపడటంతో జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసింది. ప్రస్తుత ప్రభుత్వ హాయంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలల్లో ప్రధానమైనదైన వి.ఆర్ పాఠశాల తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు మంత్రి నారాయణ తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 4వ తేదీన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విఫలమైందని వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన శ్రీమతి **ఏలూరు మృదుల, భర్త పారా చంద్రబాబు,** డోర్ నెం.7-89, తూర్పువీధి, నాగులవెల్లటూరు గ్రామం, చేజర్ల మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా. అను వారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీమతి **రాళ్లబండ కోమల** అను వారి వద్ద నుండి **రిజిష్టర్డు విక్రయ పత్రం తేది: 14-10-2024 డాక్యుమెంటు నెం.6892/2024** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **కోమల** గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీమతి **షేక్.షర్మిల** అను వారి వద్ద నుండి **రిజిష్టర్డు విక్రయ పత్రం తేది: 23-05-2024 డాక్యుమెంటు నెం.4014/2024** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **షర్మిల** గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని రెండు వేరువేరు పత్రములు ద్వారా అనగా **రిజిష్టర్డు విక్రయ పత్రం తేది: 15-02-2016 డాక్యుమెంటు నెం.589/2016** మరియు **రిజిష్టర్డు బిల్డర్ అగ్రిమెంటు తేది: 15-02-2016 డాక్యుమెంటు నెం.590/2016** ద్వారా **అంజని బిల్డర్స్ తరపున మేనేజింగ్ పార్టనర్స్ 1. శ్రీ శాఖమూరి శ్రీనాథ్** మరియు కుమారి **గట్టమనేని పవన్ కుమారి** గార్ల వద్ద నుండి కొనుగోలు చేసినారు. సదరు **ఏలూరు మృదుల** గారు **తే04-06-2025**దిన నారాయణ మెడికల్ కాలేజీ సెంటర్‌లో జెరాక్స్ తీసుకుంటున్నప్పుడు సదరు ఆస్తికి సంబంధించిన **ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.589/2016 మరియు 590/2016 ర్లు** కనబడకుండా పోయినవి. వెంటనే నా క్లయింట్ చుట్టుప్రక్కల ఎంత వెతికిన ప్రయోజనం లేకుండా పోయినదని చెప్పుచున్నారు. సదరు **ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.589/2016 మరియు 590/2016 ర్లు** ఎవ్వరికైనా దొరికినయెడల నా క్లయింట్‌కు గానీ లేదా ఈ క్రింది అడ్రస్సుకు గానీ తెచ్చి ఇవ్వవలసినదిగా కోరడమైనది. సదరు ఆస్తిపై ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఒక వారంలోపు నా క్లయింట్ కు గానీ లేదా ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తిషెడ్యూలు

ఎ-ఆస్తి షెడ్యూలు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, స్టోన్‌హౌస్‌పేట సబ్-రిజిస్ట్రారులో చేరిన, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరిన పెద్ద చెరుకూరు ఏరియాలోని సర్వే నెం.27,28,29, 30, 31, 32-సి, 34, 36-2, 37-ఎ, 37-బి, 37-సి, 37-డి, 37-ఇ, 38-ఎ, 38-బి, 39-ఎ, 39-బి, 39-ఎఫ్, 102, 103, 104-1, 104-2, 107 ర్లులోని భూమిని హంసాయిదారుల భూములతో కలిపి యిండ్లప్లాట్లుగా లే-అవుట్ చేయబడి పెద్దచెరుకూరు గ్రామ పంచాయితి వారి వల్ల అప్రూవ్ కాబడిన ప్లాను దాఖలా "సిరి గార్డెన్స్" అను లే అవుట్‌లోని ఎ-బ్లాక్ లోని నెం.38 రు ప్లాటులో ఉత్తర పార్శ్వం 22×60 కొలతలు గల 18.33 అంకణములున్నూ మరియు ఎ-బ్లాక్‌లోని 40×60 కొలతలు గల నెం.39 రు ప్లాటు విస్తీర్ణం 33.33 అంకణములున్నూ వెరశి 51.66 అంకణములు లేక 413.28 చదరపు గజములు స్థలమునకు **హద్దులు : తూర్పు:** 33 అడుగులు వెడల్పు గల లే అవుట్ రోడ్డు. ఈ దిశ కొలత 62'-00"లు, **దక్షిణం:** నెం.38 రు ప్లాటులోని కొరవ స్థలం, ఈ దిశకొలత 62'-00" లు. **పడమర :** నెం.36 రు ప్లాటు కొంత వరకు నెం.37 రు ప్లాటు కొంత వరకు, ఈ దిశకొలత 62'-00" లు. **ఉత్తరం :** నెం.40 రు ప్లాటు, ఈ దిశకొలత 60'-00" లు. ఈ హద్దులలోని 51.66 అంకణములు లేక 413.28 చదరపు గజములు స్థలములో సమిష్టిన 4.305 అంకణములు లేక 34.44 చదరపు గజములు అవిభక్తస్థలమున్నూ, యిందుకు సంబంధించిన యావత్తు యాజ్‌మెంటు హక్కులతోటీన్నీ.

బి-ఆస్తి షెడ్యూలు: పై ఏ-షెడ్యూలులో కనుపరచిన మొత్తం స్థలములో నిర్మించియున్న "అంజన ఎన్‌క్లేవ్" రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లోని మొదటి అంతస్తు (ఫస్ట్ ఫ్లోర్) లోని డోరు నెం.1బి-2-39/203రు, అసిస్‌మెంటు నెం.1031122392 రు గల ఫ్లాట్ నెం.203 విస్తీర్ణం 1125 చదరపు అడుగులు (కామన్ ఏరియాతో కలిపి) గల ఆర్‌సిసి స్లాబ్ ఫ్లాట్‌కు **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** కామన్ కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై. ఈ హద్దులలోని 1125 చదరపు అడుగులు (కామన్ ఏరియాతో కలిపి) గల ఆర్‌సిసి స్లాబ్ ఫ్లాట్‌న్నూ, యీ ఫ్లాట్‌కు అమర్చిన తలుపులు, ద్వారబంధనములు, కిటికీలు, పైకప్పు సామానులు, కబోర్డులు, హెచ్.యస్.సి. నెం.351122200 1912 రు గల కరెంటు మీటరు, కనెక్షన్, డిపాజిట్, కరెంటు వైరింగ్, కరెంటు ఫిట్టింగ్స్, గ్రిల్స్, లెట్రిన్, బాత్‌రూమ్ వగైరా యీ ఫ్లాట్‌కు సంబంధించిన యావత్తు యాజ్‌మెంటు హక్కులతోటీన్నీ.

G.S.R. RAVI TEJA Reddy,
B.Com., L.L.B., L.L.M.,
Advocate, Door No.23/1150/140, Near Pyramid,
Lecturers Colony, Magunta Lay-out North,
S.P.S.R Nellore - 524 003. Cell: 7013 455 477